
ఆంధ్రజ్యోతి



ఖమ్మంరూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాల దందా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పంచాయతీ కార్యదర్శుల నుంచి ఐఏఎస్ అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఫోర్జరీ రాయుళ్లు అంతటితో ఆగిపోకుండా బతికి ఉన్న వారు చనిపోయినట్లు, చనిపోయిన వారు బతికి ఉన్నట్లు కూడా నకిలీ ధ్రువీకరణ పత్రాలను సైతం తయారు చేస్తున్నారు. ఈ ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో కొంతకాలం క్రితం పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదై జైలుకెళ్లినవారు కూడా ఉన్నారు. ఈ దందా కొంతకాలం స్తబ్దుగా ఉన్నా.. ఇటీవల మళ్లీ భారీస్థాయిలో మొదలైనట్టు తెలుస్తోంది. తాజాగా పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసి గ్రామాల్లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఇందుకు ఒక్కో ఇంటికి రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో సాగుతున్న రిజిస్ట్రేషన్ల దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



పైసలిస్తేనే పని!

- ఫోర్జరీ సంతకాలతో ఇళ్ల రిజిస్ట్రేషన్లు
- అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నా.. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.50వేల వరకు వసూలు?
- డబ్బులు ఇవ్వకుంటే రిజిస్ట్రేషన్ కుదరదు
- ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఎదురైన అనుభవం
- రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాలూ బేఖాతర్!
- ముఖ్య అధికారి కనుసన్నల్లోనే ఫోర్జరీ దందా?
- ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఖమ్మం రూరల్ మండలంతో పాటు, చింతకాని మండలం, ముదిగొండ, కామేపల్లి, కారేపల్లి మండలాలకు సంబంధించిన భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రియల్ వెంచర్లకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే ఏదైనా ఇల్లు కానీ, భూమికానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ముందుగా దానికి సంబంధించి ప్రభుత్వానికి బ్యాంకులో చెలాన్ చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం డాక్యుమెంట్ రైటర్ ద్వారా డాక్యుమెంట్ తయారు చేయించిన అనంతరం సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాసిచ్చే ధ్రువీకరణ పత్రంతోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుంది. అందుకు ప్రభుత్వానికి మాత్రమే చలానా కట్టాల్సి ఉంటుంది. అధికారులకు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు?

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో 2022లో ఆ పంచాయతీ కార్యదర్శి ఇంటి ధ్రువీకరణ పత్రం రాసి ఇచ్చినట్లు నకిలీ పత్రం సృష్టించి కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి 2024 నవంబర్‌లో ఆ ఇంటికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకోసం సదరు ఇంటి యజమాని నుంచి రూ.60వేలు వసూలు చేసినట్లు సమాచారం. అదేవిధంగా మండలంలోని మరో గ్రామంలో ఓ నిరుపేద మహిళకు చెందిన రేకుల ఇంటి రిజిస్ట్రేషన్‌కు రూ.50వేలు వసూలు చేసినట్లు సమాచారం. జనవరిలో 612 రిజిస్ట్రేషన్లు జరిగితే అందులో సగానికిపైగా ఫోర్జరీ సంతకాలతోనే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎవరైతే మా కేంటి.. డబ్బు ఇస్తేనే రిజిస్ట్రేషన్

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించినా డబ్బులు ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు ఇవ్వకపోతే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారని సమాచారం. ఇటీవల ముదిగొండ మండలానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తమ వారికి చెందిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని వెళ్లగా ప్రభుత్వ చెలానాతో పాటు కార్యాలయ చెలానా కూడా చెల్లించాలని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఎవరైతే మాకేంటి ఆనవాయితీగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే డబ్బు చెల్లించాల్సిందే అంటూ మోహంమీదే చెప్పడంతో సదరు మాజీ

(మిగతా 6వ పేజీలో)

మంత్రి ఆదేశాలూ బేఖాతర్ !

కొద్ది నెలల క్రితం రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సబ్‌రిజిస్ట్రార్‌లతో సమావేశం సందర్భంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేలా రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తరువాతనే రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించారు. మంత్రి పొంగులేటి ఇంత స్పష్టంగా చెప్పినా ఆయన మాటలను కూడా బేఖాతర్ చేస్తూ ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల దందా కొనసాగుతోంది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ల దందా వ్యవహారంతో పాటు సదరు కార్యాలయ అధికారుల తీరును మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లేందుకు మండలానికి చెందిన కొందరు సిద్ధమయ్యారు.

అధికారి కనుసన్నల్లోనే ఫోర్జరీ దందా?

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో జరిగే రిజిస్ట్రేషన్ల దందా అంతా సంబంధిత అధికారి కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ఓ కిందిస్థాయి ఉద్యోగి ద్వారానే ఈ ఫోర్జరీ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్య అధికారి ఆదేశాల మేరకే తాము చేయాల్సి ఉంటుందని సదరు ఉద్యోగి బహిరంగంగా మాట్లాడుతూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు అవాస్తవం

అరుణ, సబ్‌రిజిస్ట్రార్ ఖమ్మం రూరల్

ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు చేయడం అనేది అవాస్తవం. పంచాయతీ కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నారనేది కూడా అవాస్తవమే.. అలాంటిది ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు.

అందని గ్యాస్ రాయితీ

- నామమాత్రంగా మహాలక్ష్మి పథకం అమలు
- లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని రాయితీ సొమ్ము
- గతేడాది ఫిబ్రవరి 27న పథకం ప్రారంభం
- ఖమ్మం జిల్లాలో ఏడాదిలో అందింది రూ.21కోట్లే



ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా గ్యాస్ రాయితీని అమలు చేస్తామని చెప్పినా అది ఆచరణలో అమలు కావడం లేదు. రూ.500లకే సిలిండర్ ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 27న ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. కానీ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 7లక్షల 53,723 సిలిండర్లకు మాత్రమే రూ.21కోట్ల 31లక్షల రాయితీ అందింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న రూ.18 తప్ప రాష్ట్ర ప్రభుత్వ గ్యాస్ రాయితీ లబ్ధిదారుల ఖాతాలో జమకావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 4లక్షల 10,404 మంది గ్యాస్ వినియోగదారులు ఉంటే వారిలో 2లక్షల 40వేల 504 మంది సబ్సిడీకి అర్హులుగా తేల్చారు. వారందరికీ గ్యాస్ సిలిండర్‌ను రూ.838లతో కొనుగోలు చేస్తే రూ.500లను మినహాయించుకుని మిగిలిన సొమ్మును లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రాయితీ సొమ్మును మాత్రం జమ చేయడం లేదు. గ్యాస్ రాయితీ అమలుకోసం అర్హులను ఎంపిక చేసేందుకు గతేడాది ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించింది. 20 మండలాలు 589 పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీల్లో 5 లక్షల 49,852 దరఖాస్తులు రాగా వాటి ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు.

రూ.18 మాత్రమే జమ

ప్రస్తుతం వినియోగదారులకు కేంద్ర రాయితీ సొమ్ము రూ.18మాత్రమే జమ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 34గ్యాస్ ఏజెన్సీల్లో 4లక్షల10వేల 404 కనెక్షన్లు ఉన్నాయి. 4లక్షల 11వేల 348 మంది (మిగతా 6వ పేజీలో)



భట్టికి వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతు రంగయ్య

ముదిగొండ మండలంలో

డిప్యూటీ సీఎం పర్యటన

పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించిన భట్టి 6

రైతులకు ఉపయోగపడేలా

రహదారుల నిర్మాణం

- భూసేకరణకు రైతులు సహకరించాలి
- ఈ ఏడాది కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి
- గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తుమ్మలను సత్కరిస్తున్న సొసైటీ చైర్మన్లు

దమ్మపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపయోగపడేలా రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నాయకులు, పలువురు రైతులు ఆదివారం గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, అందుకు ప్రణాళికను తయారు చేస్తున్నట్లు తెలిపారు. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామని, ఫ్యాక్టరీకి అవసరమైన రహదారి నిర్మాణానికి రైతులు సహకరించాలన్నారు. ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం చేయాలంటే ఎక్కడైనా భూసేకరణ చేయాల్సిఉంటుందన్నారు. వాటికి రైతులు సహకారం అందిస్తేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. పులిగుండాల ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికలకోడ్ ఉందని అనంతరం అధికారులతో కలిసి పులిగుండాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి మండలం కిష్టారం, అంబేడ్కర్ కాలనీవాసులు సింగరేణి బొగ్గుగనుల కాలుష్యంతో స్థానికంగా ఉండలేకపోతున్నామని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సింగరేణి సమస్యను స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో చర్చించి చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సొసైటీల చైర్మన్‌ల పదవీకాలాన్ని ఆరు నెలలు ప్రభుత్వం పొడిగించటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు సొసైటీ చైర్మన్‌లు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అనంతరం గండుగులపల్లిలోని ఓ వివాహానికి మంత్రి తుమ్మల హాజరయ్యారు. ఉదయం గండుగులపల్లి, అప్పారావుపేట తదితర వ్యవసాయక్షేత్రాలను సందర్శించి గుమ్మడి సాగును మంత్రి పరిశీలించిన తుమ్మల పలు సూచనలు చేశారు. మంత్రి వెంట కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాదు, తుమ్మల శేషుబాబు, ఎర్రా వసంతరావు, చల్లగుళ్ల నర్సింహారావు, గొర్లసంజీవరెడ్డి, వెల్ది జగన్మహన్‌రావు, పాలెపు రామారావు, కాసాని మంగేశ్వరరావు, లక్కింశెట్టి శ్రీను, తదితరులున్నారు.

కమ్మేస్తున్న ప్లాస్టిక్ భూతం

- నగరంలో విచ్చలవిడిగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగం
- అమలుకు నోచుకోని 2018 మునిసిపాలిటీ చట్టం
- క్షేత్రస్థాయి సిబ్బందిలో లోపించిన చిత్తశుద్ధి
- క్వింటాల్లో పట్టుకొని.. కేజీల్లో జరిమానాలు
- జరిమానాల విధింపులోనూ దాటవేత ధోరణి
- 2020లో ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా గుర్తింపు



ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ భూతం అదే స్థాయిలో వెంటాడుతోంది. 2019లో శిక్షణ కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ సురభి ఖమ్మం నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ నియంత్రణకు అధికారులతో కలిసి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 2018 మునిసిపల్ చట్టంలోని ప్లాస్టిక్ వేస్ట్ మెనేజ్‌మెంట్ అమెండ్‌మెంట్‌ను కచ్చితంగా అమలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠినంగా చర్యలు తీసుకున్నారు. దీంతో 2020లో ప్లాస్టిక్ లేని నగరంగా రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మానికి ఖ్యాతి దక్కింది. అయితే తర్వాత కాలంలో జవాన్ల నుంచి పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ల వరకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలపై దాటవేత ధోరణిని ప్రదర్శిస్తుండడంతో తిరిగి ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్‌భూతం కమ్మేసింది.

క్వింటాల్లో పట్టుకొని కేజీల్లో జరిమానాలు

ఖమ్మం నగరంలో అన్ని ప్రాంతాలకు వ్యాపార కార్యకలాపాలు విస్తరించాయి. అయితే దశాబ్దాలుగా స్థానచలనాలు లేకుండా పని చేస్తున్న జవాన్లకు ఆయా వ్యాపారుల నుంచి వీధుల వెంట చిరు వ్యాపారుల వరకు పరిచయాలు ఏర్పడ్డాయి. దాంతో మద్యం, ముక్క, కూరగాయల నుంచి షాపింగ్‌మాల్స్‌లో డిస్కౌంట్ వరకు ఆయా ప్రాంతాల జవాన్లు చెప్పింది వేదంగా మారిపోయింది. దాంతో ఖమ్మం నగర పాలకసంస్థ అధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. ప్లాస్టిక్‌పై స్పెషల్‌డ్రైవ్‌తో పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లగానే స్థానికంగా ఉన్న జవాన్లు ప్లాస్టిక్ వ్యాపారులకు ముందస్తు సమాచారం అందిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ రిటైల్ వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి వెళ్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో క్వింటాల్లో ప్లాస్టిక్‌ను పట్టుకున్న కేజీల్లో చూపించి నామమాత్రంగా జరిమానాలు విధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఈ క్రమంలో దశల వారీగా ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ భూతం కమ్మేసింది. అయితే వేసవి కాలంలో ప్లాస్టిక్‌ను కఠినంగా నిర్మూలన చేస్తే నగరంలోని డ్రైనేజీలు వర్షాకాలంలో మూసుకుపోయే ప్రమాదం తప్పుతుంది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై కేఎంసీ అధికారులు, పోలీసు ఇతరశాఖలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తే మెరుగైన ఫలితాలు అందుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ

అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- ఏపీలోని ఎటపాక వద్ద బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- మృతులు దుమ్ముగూడెం మండలం భీమవరం వాసులు



రాంబాబు, ముత్యాలమ్మ (ఫైల్)




ప్రమాద స్థలం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం భీమవరానికి చెందిన భార్యాభర్తలు సోయం రాంబాబు (52), ముత్యాలమ్మ(49)లు ఆదివారం రాత్రి సరిహద్దున ఏపీలోని ఎటపాక మండలం నవోదయ పాఠశాల ఎదుట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. భద్రాచలంలోని ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వీరిద్దరూ బైక్‌పై ఇంటికి వెళుతుండగా ఎటపాక సమీపంలోని నవోదయ పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న జామాయిల్ లోడు ట్రాక్టరు ఢీకొట్టింది. రాంబాబు తలకు హెల్మెట్ ధరించినా ప్రమాద తీవ్రతకు అది పగిలిపోయినట్లు తెలుస్తోంది. దీంతో భార్యాభర్తలిద్దరూ ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలున్నారు. అందరికీ వివాహమైనట్లు సమాచారం. భార్య, భర్తలు మృతిచెందడంతో భీమవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎటపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పరిష్కార 'మార్గం' ఏదీ?

- వైరా బస్టాండ్‌లో ప్రవేశ మార్గాల మూత
- ప్రైవేటు వాహనాలు వస్తున్నాయనే సాకుతో.. ఆర్టీసీ అధికారుల చర్యలు
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన ప్రయాణికులు
- వెంటనే ద్వారాలు తెరవాలని ఆదేశం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రవేశద్వారం మూసివేస్తూ ఏర్పాటుచేసిన సిమెంట్ పోల్స్

వైరా, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో మూసివేసిన ప్రవేశ ద్వారాలను వెంటనే పునరుద్ధరించాలని ఖమ్మం ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్‌కు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చేసిన సూచనను ఇంతవరకు ఆర్టీసీ సంస్థ పరిగణలోకి తీసుకోలేదు. ఎమ్మెల్యే సూచనను ఆర్టీసీ ఆర్‌ఎం ఏమాత్రం లక్షపెట్టలేదని చర్చ నడుస్తోంది. 'ఎమ్మెల్యే అయితే మాకేంటి' అనే రీతిలో ఆర్‌ఎం బేఖాతర్ చేశారని ఆపార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. పలువురు ప్రయాణీకులు, కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి మేరకు ఈనెల 12న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వైరా ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి మూసివేసిన ప్రవేశ ద్వారాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న స్టేషన్‌మేనేజర్ వెంకటేశ్వరరావుతో మాట్లాడగా తమ ఖమ్మం ఆర్‌ఎం ఆదేశాల మేరకు రెండు ప్రవేశ ద్వారాలను మూసివేశామని తెలిపారు. దాంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బస్టాండ్ నుంచే ఫోన్‌లో ఆర్‌ఎం సరిరామ్‌తో మాట్లాడారు. ఆ సమయంలోనే ఎమ్మెల్యేకు ఆర్‌ఎం నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారనే చర్చ కూడా నడిచింది.

ఉమ్మడి రాష్ట్రంలో 40ఏళ్ల క్రితం నాలుగు ప్రవేశ ద్వారాలతో ఈ బస్టాండ్‌ను నిర్మించారని, ప్రజలకు ఎంతో సౌకర్యంగా జాతీయ ప్రధాన రహదారి(తల్లాడ)వైపు వెళ్లే రోడ్డుకు ఉన్న రెండు ప్రవేశ ద్వారాలను అర్థాంతరంగా ఎందుకు మూసివేయాల్సి వచ్చిందని ఆర్‌ఎంను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే నలుగురైదుగురు ముఖ్యమంత్రులు కూడా ప్రజల సౌకర్యాన్ని ఆలోచించారని,

(మిగతా 6వ పేజీలో)




నేడు ఖమ్మానికి

బీజేపీ నేత ఈటల

ఖమ్మం బైపాస్‌రోడ్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నేడు సాయంత్రం 7 గంటలకు ఖమ్మంలో పర్యటిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు రాత్రి 7గంటలకు శ్రీశ్రీ హోటల్‌కు చేరుకుని టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ టీచర్లతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం నగరంలో బసచేసి మంగళవారం ఉదయం 9-15 గంటలకు అక్కడే జరిగే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని, అనంతరం ఖమ్మం నుంచి వరంగల్‌కు వెళతారని గల్లా తెలిపారు.

కాకతీయుల కాలంలో నిర్మించిన ముక్కంటే శ్వరాలయం నిర్లక్ష్యానికి గురవుతోంది. అటు పాలకులు, ఇటు గ్రామస్థులు పట్టించుకోక పోవడంతో ఆలయాలు నిరాదరణకు గురవుతు న్నాయి. ప్రస్తుతం అలాంటి ఆలయాలు కట్టించ లేకపోయినా.. ఉన్న వాటిని సంరక్షించుకోవాల్సి ఉంది. కూసుమంచిలోని పురాతన కాకతీయుల ఆలయంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...


కూసుమంచిలోని ముక్కంటేశ్వరాలయం

నిర్లక్ష్యపు నీడలో చారిత్రక కట్టడాలు

వైభవం కోల్పోతున్న కాకతీయుల నాటి ముక్కంటేశ్వరాలయం

- పునరుద్ధరించినా.. పూజలకు నోచుకోని వైనం
- దేవాదాయశాఖ పట్టించుకోవాలంటున్న ప్రజలు

కూసుమంచి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పూర్వీకుల కళానైపుణ్యాన్ని చాటిచెప్పే చారిత్రక కట్టడాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సుమారు 11శతాబ్దంలో కాకతీయరాజులు భక్తిభావంతో తమ అభిరుచులకు అనుగుణంగా కూసుమంచి గ్రామం చివరలో శివాలయం (గణపేశ్వరాలయం), దాని ప్రక్కనే 200మీటర్ల దూరంలో ముక్కంటేశ్వరాలయం నిర్మించారు. గణపేశ్వరాలయాన్ని పునర్జీవం గావించగా, ముక్కంటేశ్వరాలయంలో శివుడు, వేణుగోపాలస్వామి, గణపతి ఆలయాలు ఉన్నాయి. పురాతన కాలంలో ఇంతనైపుణ్యమా... అని ఇప్పటి ప్రజలు అబ్బురపడేలా అందంగా ఈ దేవాలయాలున్నాయి. టన్నుల కొద్ది బరువుండే పెద్దపెద్ద బండరాళ్లను ఒకదానిపై ఒకటి పేర్చి వాటిపై శిల్పాలు చెక్కి ఔరా.. అనిపించేవిధంగా నిర్మించారు. శ్రీశైలం క్షేత్రంలోని శివలింగానికి దీటైన అద్భుత శివలింగాలు, చక్కని నందీ విగ్రహాలు ఉన్నాయి. పెద్దపెద్ద బండరాళ్లతో సుందరంగా చెక్కి ఈ దేవాలయాలను నిర్మించారు.


బండరాయిపై చరిత్ర

రూ.60లక్షలతో పునరుద్ధరణ

ప్రస్తుతం ఇలాంటి దేవాలయాలను కట్టించే అవకాశం లేనందున, పురాతన ఆలయాలపై దృష్టిసారించిన అప్పటి ప్రభుత్వం ఐదేళ్లక్రితం ఆలయాల పునరుద్ధరణకు సంకల్పించి గణపేశ్వరాలయానికి రూ.30లక్షలు, ముక్కంటేశ్వరాలయానికి రూ.30లక్షలు మొత్తం రూ.60లక్షలు కేటాయించింది. వెంటనే పెద్దపెద్ద క్రేన్‌ల సాయంతో బండరాళ్లను సరిచేసి ఆలయాలను పునరుద్ధరించారు. శివుడు, గణపతి, వేణుగోపాలస్వామి ఆలయాల్లోని రాళ్లను కదిలించి పూర్తిగా పునర్నిర్మించారు.

ముక్కంటేశ్వరాలయానికి దారి లేదు

కాకతీయులు ఆలయాల నిర్మాణ సమయంలోనే వాటి ఆలనాపాలనకు, ధూపదీప నైవేద్యాలకోసం అవసరమైన నిధులకోసం వందలాది ఎకరాలు భూములు ఇచ్చేవారని ప్రజలు విశ్వసిస్తారు. ఈ ఆలయం కింద కూడా దేవుడి మాన్యాలు ఉన్నాయని అనుకుంటారు. కాగా అవి ప్రస్తుతం అన్యాక్రాంతమయ్యాయి. కనీసం ముక్కంటేశ్వరాలయంలోకి వెళ్లేందుకు దారి కూడా లేదు. అధికారులు, గ్రామస్థులు ఆలయానికి వెళ్లేందుకు అవసరమైన భూమిని పరిసర రైతుల నుంచి సేకరించాల్సి ఉంది


అందమైన నగిశీలు

ఆలయాలను ప్రభుత్వం పునరుద్ధరించినప్పటికీ విగ్రహ ప్రతిష్ఠలు నిర్వహించాల్సి ఉంది. గతంలో ఉన్న విగ్రహాలు చోరీకి గురైనందున కొత్త విగ్రహాలను తీసుకవచ్చి ప్రతిష్ఠాపనలు చేసి ఆలయాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కొత్తగా శివలింగం, గణపతి, వేణుగోపాలస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరుతున్నారు. అదేవిధంగా కూసుమంచి రామాలయం వెనుకభాగంలో దుర్గామాత ఆలయం వెలుగు చూసింది. కాకతీయుల శివాలయాన్ని పోలి ఉంది. దీన్ని కూడా పునఃప్రతిష్ఠలు చేయాలని కోరుతున్నారు.

అటవీ ప్రాంతాల్లో సైనిక క్యాంపులను ఎత్తివేయాలి

ఎన్‌డీ ఆధ్వర్యంలో నిరసన

బోనకల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సైనిక క్యాంపులను ఎత్తివేయాలని ఎన్‌డీ జిల్లా నాయకుడు ఎం.గిరి డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివాసీలపై జరుగుతున్న మారణకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను వ్యతిరేకిస్తున్న ఆదివాసీలపై ఈ నెల 9న మావోయిస్టుల పేరుతో ఎన్‌కౌంటర్ చేయడం దారుణమన్నారు. గ్రామ సమస్యల మీద చర్చించడానికి వెళ్లిన అమాయకులైన ఆదివాసీలను పట్టుకుని పోలీసులు చిత్రహింసలు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ప్రజలను కూడ బలి తీసుకోవడం శోచనీయంగా పేర్కొన్నారు. చత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న మారణకాండను ఆపాలని, ఎన్‌కౌంటర్, హత్యల పై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే తగు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీ నాయకులు పి. వెంకటేశ్వర్లు, సతీష్, రవి, ఉపేందర్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

పంచాక్షరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

93వ జన్మ దినోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బూర్గంపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరి పంచాక్షరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో తనను ప్రోత్సాహించిన పంచాక్షరయ్య, చేకూరి కాశయ్యలు మరువలేని వ్యక్తులని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో నిర్వహించిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంచాక్షరయ్య 93వ జన్మదిన వేడుకల మహోత్సవానికి మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వేద ఆశీర్వచనం, పంచాక్షరయ్య జీవన ప్రస్థానం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, పంచాక్షరయ్య పద్యవైభవం, 101 మంది కవి పండితులకు సత్కారాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆయనకు ఈ ప్రాంతం అంటే ఎనలేని అభిమానమని...ఈ ప్రాంతం మీద ప్రేమతో పంచాక్షరయ్య పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో గోదావరి జలాలను బీడు భూములకు పారించడంతోపాటు రైలును భద్రాచలం రాముడు పాదాల వద్దకు తీసుకొస్తామన్నారు. పార్టీ అగ్ర నాయకులు, ప్రజల పిలుపు మేరకు పార్టీలు మారానని, కానీ ఎప్పటికీ ఎన్టీఆర్ చూపించిన మనిషినే అని అన్నారు. జిల్లాలో ఎవరూ చేయలేని పనులు చేసే అదృష్టం భగవంతుడు, జిల్లా ప్రజలు కల్పించారన్నారు. కార్యక్రమంలో పినపాక, భద్రాచలం శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధులతో పాటు మండలి బుద్ధ ప్రసాద్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి గోపాలకృష్ణ, చిగురుమళ్ల శ్రీనివాస్, డాక్టర్ తాళ్లూరి బాబు రావు, రాధాకృష్ణ, రాజాశ్రీకృష్ణ, డాక్టర్ గాయత్రి, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, నీలిమ, డాక్టర్ గొట్టిపాటి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అనితరాణి, వల్లూరిపల్లి వంశీకృష్ణ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజీవ్ ట్రోఫీ క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఆదివారం రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాంగ్రె స్ పార్టీ యువనాయకుడు తుమ్మల యుగంధర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని, ఆటల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. నగరంలో సుమారు వారం రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 17 మండలాల జట్లు పాల్గొన్నాయి. పోటీల తొలి రోజు భద్రాద్రి కొత్తగూడెం జట్టుపై ఖమ్మం అర్బన్ జట్టు గెలుపొందింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం అర్బన్ మండల జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేయగా.. అనంతరం ఛేజింగ్‌కు దిగిన భద్రాద్రి జట్టు 16 ఓవర్లలో 109 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో ఖమ్మం జట్టు 36 పరుగులతో విజయం సాధించింది. కార్యక్రమంలో నిర్వాహకులు మతిన్, నిరంజన్, ఫరీద్‌ఖాద్రి తదితరులు ఉన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న తుమ్మల యుగంధర్

ముదిగొండ మండలంలో డిప్యూటీ సీఎం పర్యటన

- పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించిన భట్టి


భట్టి విక్రమార్కకు పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ముదిగొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండలంలోని న్యూలక్ష్మీపురం, గంధసిరి, బాణాపురం గ్రామాల్లో భట్టి విక్రమార్క పర్యటించారు. న్యూలక్ష్మీపురం గ్రామంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చెరుకూరి వెంకట్రామయ్యను పరామర్శించారు. గంధసిరిలో వధువరులను ఆశీర్వదించి, మాజీ ఎంపీపీ దివంగత మట్టా వెంకటేశ్వర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో పలు సమస్యలపై భట్టి విక్రమార్కకు వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనాన్ని నిర్మించాలని తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డంలక్ష్మి, ప్రమీలకు సంబంధించిన భూమి పండ్రేగుపల్లి రెవెన్యూలో ఉందని, ఆ భూమిని డీవీఆర్ స్టోన్ క్రషర్ యజమాని నాలుగు సంవత్సరాల లీజు పేరుతో తీసుకొని తమకు 90సంవత్సరాలు లీజు ఉందని బెదిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తమ భూమిని తమకు ఇవ్వాని కోరితే బెదిరిస్తున్నాడని భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేశారు.

వనంవారిక్రిష్ణాపురానికి చెందిన కౌలురైతు రంగయ్య మొక్కజొన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లడంతో వారి సమస్యలను పరిష్కరించి నిందితులపై చర్యలు తీసుకోవాలని సీఐ మురళిని భట్టి ఆదేశించారు. అలాగే బాణాపురంలో అండర్-17 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన ఎర్రా రచిత, బింధు రేవతిలను అభినందించి సన్మానించారు.

కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, వెంకట్, వీరబాబు, అజ్గర్, రాంబాబు, ఉసికల రమేష్, ఉపేంద్రరావు, రామారావు, రవీందర్‌రెడ్డి, పల్లపాటి కృష్ణ, వట్టికూటి వెంకటేశ్వర్లు, పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పని!


ఓ గ్రామంలో రూ.50 వేలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసిన రేకుల ఇల్లు


ఫోర్జరీ చేసిన తెల్దారుపల్లి పంచాయతీ కార్యదర్శి సంతకం

(5వ పేజీ తరువాయి)

మిన్నకుండిపోయారని సమాచారం. అదేవిధంగా ఖమ్మం పట్టణానికి చెందిన ఓ కార్పొరేటర్ తనకు చెందిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఓ మంత్రి పక్కన ఉండే ముఖ్య వ్యక్తితో చెప్పించుకుని వెళ్లినా ఎవరైతే మాకేంటి అనే సమాధానం వచ్చినట్లు సమాచారం. దీంతో చేసేదేం లేక అతడు కూడా డబ్బు చెల్లించినట్లు సమాచారం. అదే విధంగా రియల్ వెంచర్‌కు సంబంధించి డీటీసీపీ లేఅవుట్‌తో పాటు అన్ని అనుమతులు ఉన్నా డబ్బులు ఇవ్వకుంటే ఏవో కొర్రీలు పెట్టి రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారని, అన్నీ ఉన్నా తప్పని పరిస్థితిలో ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.25వేల నుంచి రూ.50వేలు ముట్టచెప్పాల్సి వస్తోందని ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి 'ఆంధ్రజ్యోతి'తో వాపోయాడు. ఈ విషయంపై సంబంధిత మంత్రి, కలెక్టర్ దృష్టి సారిస్తేనే ఇక్కడ ఆగడాలు ఆగుతాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

నా సంతకాన్ని ఫోర్జరీ చేశారు

రాధారాణి, పంచాయతీ కార్యదర్శి

2022లో తెల్దారుపల్లి కార్యదర్శిగా పని చేశా. రిజిస్ట్రేషన్ కోసం నేను ఎవరికీ ఇంటి ధ్రువీకరణ పత్రం రాసి ఇవ్వలేదు. నేను రాసిచ్చినట్లు ఉన్న ఓ ధ్రువీకరణ పత్రంతో ఖమ్మం రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ ఇంటికి రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిసింది. వాస్తవానికి అది నా సంతకం కాదు. నా సంతకాన్ని ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించారు.

త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు

మధిరటౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఆదివారం మధిరలోని టీవీఎం పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు 1970లో ప్రారంభమైన కళాశాల ఎంతో మంది గొప్ప వ్యక్తులను తయారు చేసిందని స్వర్ణోత్సవం నిర్వహిద్దామనుకున్న తరుణంలో కరోనా రావడంతో ఆగిపోయామని తెలిపారు. స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా జరిపేందుకు కమిటీ వేసి త్వరలో తేదీని నిర్ణయిద్దామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల 1970-71 మొదటి ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ములకలపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో మధిర లోని క్లబ్ కాంప్లెక్స్ లో సమావేశమయి మార్చి 16న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని కోనా సెంట్రల్ హాల్‌లో జరిపేందుకు నిర్ణయించారు. కళాశాల స్వర్ణోత్సవాన్ని కూడా దిగ్విజయం చేసేందుకు మొదటి బ్యాచ్ విద్యార్థులు ఆ సమావేశానికి రావాలని కోరారు.

అందని గ్యాస్ రాయితీ

(5వ పేజీ తరువాయి)

తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీటిలో తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ప్రజాపాలన దరకాస్తుల్లో గ్యాస్ రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులుగా గుర్తించారు. ప్రజాపాలనలో 3లక్షల 20వేల 650 మంది అర్హులుగా తొలుత జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. తర్వాత మళ్లీ వడపోసి కేవలం 2లక్షల 40వేల 504 మందిని ఎంపిక చేశారు. మహాలక్ష్మి పథకం పేరుతో ప్రవేశపెట్టిన రూ.500లకు గ్యాస్ పథకాన్ని నగదు బదిలీ విధానం ద్వారా అమలు చేస్తామని ప్రకటించినా రాయితీ సొమ్ము జమకాకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ పథకం అమలుపట్ల లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జిల్లాలో సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 2,01,640, డబుల్ 78,023, దీపం పథకం59,742, సీఎస్ఆర్ 23,688, ఉజ్వల 47,311, మొత్తం4,10,404 ఉన్నాయి.

రాయితీ సొమ్ము రావడం లేదు

వడ్డెంకుట్ల యశోధ, టేకులపల్లి



ప్రతిసారి రూ.840లతో సిలెండర్ కొంటున్నాం. గ్యాస్ సిలిండర్ రూ.500లకే వస్తుందని, తర్వాత బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. కానీ కొన్న ప్రతిసారి రూ.18 తప్ప మిగిలిన డబ్బులు రావడం లేదు. అదేమంటే మీరు జిల్లా ఆఫీస్‌కు వెళ్లండి, ఎమ్మార్వో ఆఫీస్‌కు వెళ్లండి అంటున్నారు. ప్రభుత్వం గ్యాస్ లబ్ధిదారుడిగా పట్టా ఇచ్చినా గ్యాస్ డబ్బులు మాత్రం వేయడం లేదు.

రాయితీ సొమ్ము రాకుంటే సంప్రదించండి

చందన్‌కుమార్, డీఎస్‌వో



జిల్లాలో అర్హులైన గ్యాస్ లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ సొమ్మును ప్రభుత్వం ఆయా ఖాతాల్లో జమచేస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి 27నుంచి ఇప్పటి వరకు 2లక్షల 40వేల 504మందిని అర్హులుగా గుర్తించాం. వీరికి గాను 7,53,723 సిలిండర్లకు రూ21కోట్ల 31లక్షల 31వేలను జమ చేశాం. రాయితీ అందకపోతే టోల్‌ఫ్రీ నెంబర్ 1967 లేదా 1800 42500333 నెంబర్‌కు కాల్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): 1984లో కానిస్టేబుల్స్‌లో ఉద్యోగంలో చేరి ఉద్యోగ విరమణ పొందిన స్నేహితులు కలుసుకున్నారు. ఖమ్మంలో ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఆరోజుల్లో చేసిన పోలీసు విధులను గుర్తు చేసుకున్నారు. ఎవ్వరు ఏ హోదాలో పదవీ విరమణ పొందారో మాట్లాడుకున్నారు. కుటుంబ సభ్యులతో సంతోషాలను పంచుకున్నారు. ఆనాటి కానిస్టేబుల్స్ ఆజుమతుల్లా, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, ఎండీ అహ్మద్, వీర అంజనేయులు, రామారావు, ఎస్‌కే హుస్సేన్, అజీజ్, శ్రీహరిరావు,రామారావు, షరీఫ్, దయాకర్ పాల్గొన్నారు.


విశ్రాంత కానిస్టేబుళ్లు

పరిష్కార 'మార్గం' ఏదీ?

(5వ పేజీ తరువాయి)

ఆర్‌ఎంగా మీరు, ఎమ్మెల్యేగా తాను ప్రజలకు సౌకర్యంగా సేవలందించాలే తప్ప వారిని ఇబ్బంది పెట్టకూడదని స్పష్టం చేశారు. మీ చర్యల వల్ల అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళనలు చేసే పరిస్థితి తలెత్తిందని, ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని ఆర్‌ఎం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆర్‌ఎం సరిరామ్ మాట్లాడుతూ జాతీయ ప్రధాన రహదారి వైపు ప్రవేశ ద్వారాలు ఉన్నందున ప్రైవేట్ వాహనాలు తిరుగుతున్నాయని, ప్రమాదాలు జరిగే ప్రమాదముందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రాకుండా, ప్రమాదాలు జరుగకుండా పోలీసుల సహకారం తీసుకోవాలని స్పష్టం చేశారు. అందుకు ఆర్‌ఎం సమాధానమిస్తూ పోలీసుల సూచనలతోనే ఈ రెండు ప్రవేశ ద్వారాలు మూసివేశామని చెప్పడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. తానైనా, ఆర్టీసీ ఆర్‌ఎం మీరైనా, పోలీసులైనా ప్రజలకు మేలు చేసే పనులు చేయాలే తప్ప వారిని ఇబ్బందులకు గురిచేసే పనులు చేయకూడదని నిలదీశారు. తనకు ఎలాంటి మాటలు చెప్పొద్దని వెంటనే మూసివేసిన ప్రవేశ ద్వారాలను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇది జరిగి దాదాపు వారంరోజులు కావస్తున్నా ఆర్టీసీ అధికారుల్లో కనీస చలనం లేకుండాపోయింది. 'ఎమ్మెల్యే చెబితే మా కేంటి' అనే నిర్లక్ష్యధోరణి ఆ సంస్థ అధికారుల్లో కనిపిస్తోందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. మూసివేసిన ప్రవేశ ద్వారాల్లో కనీసం పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న అవుట్‌గేట్‌నైనా పునరుద్ధరిస్తే ఆర్టీసీ డ్రైవర్లు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తన మాటను ఆర్టీసీ ఆర్‌ఎం భేఖాతర్ చేసినందున ఆయన నిర్లక్ష్య ధోరణిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ.సజ్జనార్ దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యకు ముగింపు పలకాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరుతున్నారు.



వైరా ఆర్టీసీ బస్టాండ్ నుంచి సెల్‌ఫోన్‌లో ఆర్‌ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్(ఫైల్)

క్రైం సమాచారం

రెచ్చిపోయిన గంజాయి స్మగ్లర్లు

» కానిస్టేబుల్‌ను ఢీకొట్టి బైక్‌పై పరారైన వ్యక్తులు




సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు

భద్రాచలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం బ్రిడ్జి చెక్ పోస్టు వద్ద గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోయారు. వాహన తనిఖీల్లో సారపాక వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని అక్కడ విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ ఆపేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో బైక్‌పై ఉన్న వ్యక్తులు ఆపకుండా కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పరారీ అయ్యారు. దీంతో సమీపంలో ఉన్న పోలీసు సిబ్బంది వచ్చి స్వల్పంగా గాయాలపాలైన కానిస్టేబుల్‌ను అక్కడ నుంచి తీసు కెళ్లారు. సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాల ఆధారంగా ఆ ద్విచక్ర వాహనాన్ని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

గోదావరిలో దూకిన యువకుడు

భద్రాచలం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం ఉదయం సమయంలో గుర్తు తెలియని వ్యక్తి గోదావరి వంతెన మీద నుంచి నదిలోకి దూకాడు. బ్రిడ్జీ ఆరో నెంబరు పిల్లరు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందిచండంతో సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అలాగే నదిలో దూకిన వ్యక్తి గురించి గజ ఈత గాళ్ల సాయంతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



పినపాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగినేపల్లి గ్రామం వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మణుగూరు నుంచి మంగపేట వైపు వెళ్తు న్న(ఖాళీ)లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ములుగు జిల్లా మంగపేట మండలం కొత్త మల్లూరు గ్రామానికి చెందిన మాటూరి హనుమంతరావు (52) అక్కడికక్కడే మృతి చెందగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గీసరెల్లి గ్రామానికి చెందిన మునిగెల నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన నాగేశ్వరరావును స్థానికులు హుటాహుటిన మణుగూరు ప్రభుత్వాసుపత్రికి తరలిం చగా, పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ప్రభుత్వాసుప త్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన మాటూరి హనుమం తరావు, తీవ్ర గాయాలైన మునిగెల నాగేశ్వరరావులు తోడళ్లుల్లు. ఆది వారం హనుమంతరావు తన తోడల్లుడు నాగేశ్వరరావుతో కలిసి, బైక్‌పై చర్ల మండలంలోని గీసరెల్లి గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడు హనుమంతరావుకు ఇద్దరు భార్యలు శంకరమ్మ, వరలక్ష్మి, ఇద్దరు కుమారులు జగదీష్, శరత్ ఉన్నారు. ఈ మేరకు ప్రమాద స్థలానికి చేరుకున్న ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో జరిగింది. మేడిదప ల్లి-ఏలువారిగూడెం గ్రామాల మధ్య ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలవ వద్ద ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. మండలంలోని పాతర్ల పాడు గ్రామానికి చెందిన కోలా సైదులు(41) బ్యాండుమేళం వాయిస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 14న బ్యాండుమేళం వాయించేం దకు ఇంటినుంచి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలవ వద్ద అనుమానస్పదంగా పడి ఉన్నాడు దీంతో గ్రామస్థులు పోలీసు లకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కూసుపుడి జగదీష్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. సైదులు ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక హత్యచేశా రనేది పోస్టుమార్టం నివేదికలో తేలాల్సి ఉంది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

బైక్ ప్రమాదంలో యువకుడి మృతి




మధిరటౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి జరిగిన మోటర్ సైకిల్ ప్రమాదంలో గాయపడిన మధిర బంజారా కాలనీకి చెందిన రోహన్‌సాయి(18) మృతి చెందాడు. మధిరలోని శాంతి థియేటర్ వద్ద డివైడర్ ను మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘట నలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు యువ కుల్లో రోహన్‌సాయి మృతి చెందాడు. ఇతడు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌పాషా ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో యువకుడు అశోక్ కు కాలు చేయి విరి గాయి. టౌన్ ఎస్‌ఐ సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొణిజర్ల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గా యాలు అయ్యాయి. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం చింత కాని మండలం రామకృష్ణాపురానికి చెందిన చర్లపల్లి వెంకటేష్ కొణి జర్ల బంధువుల ఇంటికి వచ్చి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళుతు న్నాడు. తనికెళ్ల దాటిన తర్వాత ఓదాబా వద్ద వైరా వైపు నుంచి వెళుతున్న లారీ దాబాలోకి వెళుతున్న క్రమంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వెంకటేష్ పక్కకు పడిపోగా ద్విచక్రవాహనం లారీ టైర్ల కింద పడింది. క్షతగాత్రుడికి నడుముభాగాన తీవ్రగాయాలు కావ డంతో ఓ ఆటో ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పట్టుబడిన టిప్పర్లు

దమ్మపేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీలోని రాజ మండ్రి నుంచి అక్రమంగా వస్తున్న రెండు ఇసుక టిప్ప ర్లను దమ్మపేట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. దమ్మపేట పోలీసులు మందలపల్లి క్రాస్‌రోడ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుకతో వస్తున్న రెండు టిప్పర్లను తనిఖీ చేశారు. అనుమతి లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఇసుక కుప్పల సీజ్

మధిర రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం గ్రామంలో అక్రమంగా రవాణా చేసి నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను ఆదివారం తహసీల్దార్ రాంబాబు సీజ్ చేశారు. ఈగ్రామంలోని ఏటి నుంచి ట్రక్కుల్లో తోలి గ్రామంలోని ఓ చోట ఇసుకను నిల్వ ఉంచటంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆ కుప్పల చుట్టూ బౌండరీ గీయించి సీజ్ చేశారు.

నేడు వేమన పద్య గళార్చన

» 200 మంది విద్యార్థులు ఒకేసారి పఠనం

» జేవీఆర్ డిగ్రీ కళాశాలలో పూర్తయిన ఏర్పాట్లు



వేమన శతక పద్యాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి(ఫైల్)

సత్తుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 200 మంది విద్యార్థులు వేమన శతకంలోని వంద పద్యాలను ఒకే గొంతుకగా ఏక కాలంలో పఠిస్తూ చూడకుండా పద్య గళార్చన చేయను న్నారు. గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారా యణరాజు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నారు. సోమవారం జేవీఆర్ డిగ్రీ కళాశాలలో వేమన శతక పద్య గళార్చనకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గార్లపాటి రామ కృష్ణ, బొల్లేపల్లి మధుసూదనరాజు తెలిపారు.

1824లో వేమన శతక పుస్తకం

ఐదు శతాబ్దాల క్రితం సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ ప్రజాకవి యోగి వేమన వేలాది పద్యాలను ఆశువుగా చెప్పారు. అవన్నీ వేమన శతక పద్యాలుగా ప్రజల హృదయాలను హత్తుకున్నాయి. కాలక్రమంలో వేమన రాసిన పద్యాల తాళపత్ర గ్రంథాలు కనుమరుగయ్యాయి. పందొమ్మిదో శతా బ్దంలో కడప జిల్లా అధికారిగా ఉన్న చార్లెస్ ఫిలిప్ (సీపీ) బ్రౌన్ వేమన పద్యాలను 1824లో పుస్తక రూపంలో ప్రచురించి సమాజానికి కానుకగా అంద జేశారు. వేమన శతక పద్యాలు వెలుగు చూసి ఇప్ప టికి రెండు శతాబ్దాలు అయింది.



మూడు వేల పద్య పుస్తకాల పంపిణీ

పిల్లల్లో పఠన, లేఖన సామర్థ్యాలతో పాటు విలువలు, జ్ఞాపక శక్తి పెంపొందించేవి వేమన పద్యాలని, పిల్లల్లో ప్రతిభను వెలికి తీసే అనేక ప్రత్యేకతలు వేమన శతకంలో ఉండటంతో గతేడాది గార్లపాటి -బొల్లేపల్లి స్మారక ట్రస్ట్, ఆషా స్వచ్ఛంద సంస్థలు 3000 శతక పద్యాల పుస్తకాలను ప్రచురించి సత్తుపల్లి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ శతక పద్యాలను నేర్చుకున్న 200 మంది విద్యార్థులు సోమ వారం డిగ్రీ కళాశాలలో జరగనున్న కార్యక్రమంలో చూడకుండా ఒకే సారి వంద పద్యాల గళార్చన చేయనున్నారు. సోమవారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపి అధ్యక్షతన జరిగే కార్యక్ర మాలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాపకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొంటారని నిర్వాహ కులు తెలిపారు.

గతంలో పలు కార్యక్రమాలు..

వేమన శతక పద్యాలు విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్దే విగా ఉండటంతో వేమన శతక పద్యాలకు విశ్రాంత గ్రంథపాల కుడు రామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదన రాజు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా తమ ట్రస్టుల ద్వారా అనేక కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. 2013లో వేమన శతక పద్యాల ఆధారంగా 50 కథ లతో మధుసూదన రాజు 'తాత చెప్పిన కథలు' పుస్తకం రాయగా దానిని అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ ఆవిష్కరించారు. పుస్తకాలను మండలంలోని అన్ని పాఠశా లలకు ఉచితంగా పంపిణీ చేశారు. 2014లో సిద్దారం గ్రామానికి చెందిన విద్యార్థులు శ్రీలత, నాగవంశీ వేమన పద్యాలతో పద్యధారణ శతావధానం చేశారు. 2015లో వేమన పద్యాల ఆధా రంగా రూపొందించిన వేమన భాషా మృతం మాదిరి పాఠ్యపుస్తకాన్ని కాంప్లెక్స్ స్థాయిలో ప్రచురించి పాఠశాలలకు అంద జేశారు. ఈ పుస్తకాన్ని అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. 2016లో చిలకా రాహుల్ అనే విద్యార్థి వేమన శతకాన్ని వేగంగా ఏడు నిమిషాల్లో చూడకుండా చదివి రికార్డు సృష్టించాడు. 2017లో సిద్దారం విద్యార్థిని యామినీశ్రీ వేమన శతకంలోని వంద పద్యాలను వెనుక నుంచి చదివి రికార్డు సృష్టించింది. 2023లో బొర్రా మన్విత్ మూడవ తరగతి చదువుతూ వేమన శతక పద్యాలతో అష్టా వధానం చేశాడు. ప్రస్తుతం 200 మంది విద్యార్థులు ఒకే సమయంలో వేమన శతక పద్యాల గళార్చన చేయనున్నారు. ఇతర భాషలు నేర్చుకోవటానికి మాతృ భాష చాలా అవసరమని అందరి సహకా రంతో వేమన శతక పద్యాలు నేర్పించే కార్యక్రమం కొనసాగిస్తామని రామకృష్ణ, మధుసూదనరాజు తెలిపారు.

'గౌడ' కులస్థులను ఎస్టీలుగా గుర్తించాలి

» ఆత్మీయ సమ్మేళన సదస్సులో రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ఏజె న్సీలో నివసిస్తున్న గౌడ కులస్థులను ఎస్టీలుగా గుర్తించాలని ఏజెన్సీ గౌడ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నరాటి వెంకన్న ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు మండలం ముకుందాపురం గ్రామంలో ఏజెన్సీ గౌడుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా నరాటి వెంకన్న మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీ గిరిజనులతో కలిసి జీవి స్తున్న ఏజెన్సీ గౌడ కులస్థుల జీవితాలు దుర్భ రంగా ఉన్నాయని అన్నారు. ఏజెన్సీలో నివసి స్తున్న ఇతర కులాలకు పాలకులు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, గౌడలకు మాత్రం ఏజెన్సీ చట్టాల పేరుతో ఉన్న సొసైటీ లను రద్దు చేశారని ఆరోపించారు. రాజ్యాం గంలో ఆర్టికల్ 342, 5వ షెడ్యూల్‌లో ఏజెన్సీ గౌడులను ఎస్టీలుగా గుర్తించాలని ఉన్న నేటి పాలకులు ఏజెన్సీ గౌడులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ గౌడుల హక్కుల కోసం అందరు సంఘటితంగా ఉద్యమించాలని పిలు పునిచ్చారు. గతంలో ఏజెన్సీలో రద్దు చేసిన గౌడ సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ అన్ని సంక్షేమ పథకాలు గౌడ కులస్థులకు కేటాయించాలని కోరారు. ఈసదస్సులు గౌడ సంఘం ముఖ్య సలహా దారు కొత్త వెంకటేశ్వర్లు, బసవ వెంకటేశ్వర్లు, ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు బందం నాగయ్య, ఉమ్మగాని సత్యం, శ్రీరాం కోటయ్య తదితరులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో పబ్బు శ్రీను, ఐలు యాకయ్య, ఐలు నారాయణ, మోడెం వెంకన్న, కుర్ర వెంకన్న, సోల్తి ఐలయ్య, నరాటి కోటి, పబ్బు వీరేష్, వెంకటి, శివ, రాజారాం తది తరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు జ్వాలా లక్ష్మీనరసింహుడు

» కేరళ మహాచండి ఉపాసకుడు హరికృష్ణ గురూజీ



అమ్మవారికి పూజలు చేస్తున్న హరికృష్ణ గురూజీ

కరకగూడెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమత్ భట్టుపల్లి పంచాయతీ బర్దారం కారడవిలో స్వయంభూగా వెలసిన జ్వాలా లక్ష్మీనరసింహ స్వామి మహిమాన్వితుడని కేరళ మహచండి ఉపాసకుడు డాక్టర్ హరికృష్ణ గురూజీ, కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ అన్నారు. ఆదివారం వారు జ్వాలా లక్ష్మీనరసింహ స్వామిని, కాళిమాత, దుర్గామాత అమ్మవార్లకు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పోలెబోయిన రవితేజ, చుంచు సంతోష్ కుమార్, చందా శంకర్, చందా అశోక్, చర్ప సాంబశివరావు, పోలెబోయిన అశోక్, చందా ప్రదీప్, మైపతి తరుణ్ కుమార్, తాటి ముక్తేశ్వర్, ఊకె రామకృష్ణ, చింతా వెంకటేశ్వర్లు, ముత్తయ్య, ఏడూళ్ల శోభన్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హోటల్‌లో మంటలు

» అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

» సుమారు రూ.4.90 లక్షల ఆస్తి నష్టం




మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం పట్టణంలోని తాటిపల్లి రెసిడెన్షియల్ హోటల్లో ఆదివారం విద్యుత్ సర్క్యూ ట్‌తో మంటలు వచ్చాయి. దీంతో హోటల్లో ఉన్న ప్రజలు ఆందోళనకు గుర య్యారు. హోటల్లోని మూడో అంతస్తులో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరగ డంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న కొత్తగూడెం అగ్ని మాపకశాఖ సిబ్బంది టెండర్ సహాయంతో సంఘటన స్థలానికి చేసుకు న్నారు. ఎగిసిపడుతున్న మంటలను హోటల్ సిబ్బంది అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4.90 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు కొత్తగూడెం అగ్నిమాపకశాఖ అధికారి కొండ పుల్లయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో చిన్నారికి తీవ్రగాయాలు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఆదివారం సాయంత్రం జరిగింది. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి లాస్య అనే 12 ఏళ్ల చిన్నారి డాబా మీద ఉన్న దుస్తులు తీస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్‌తీగలు తగి లాయి. దీంతో చిన్నారి తీగలపై పడిపోవటంతో తీవ్రంగా గాయాలు అ య్యాయి. అటుగా వెళుతున్న వ్యక్తులు కర్రలతో చిన్నారిని తీగల నుంచి వే రు చేసి అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉం డటంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు.

వసతి గృహంలో జూనియర్ విద్యార్థులపై దాడి

» ఒకరికి గాయాలు » ఆరుగురు సీనియర్లపై కేసు



గాయపడిన విద్యార్థి

పెనుబల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఇంట ర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసిన ఘటనలో ఇంటర్ ఫస్టి యర్ విద్యార్థి ఒకరు గాయపడ్డాడు. సదరు విద్యార్థులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. కుప్పెనకుంట్లలోని వసతి గృహంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు అధికారుల అనుమతితో టీవీలో సినిమా చూస్తున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆ సినిమా వద్దని అభ్యంతరం చెప్తూ వారికి ఇష్టమైన సినిమాను చానల్ పెట్టుకొని చూస్తుండగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు సినిమా చూడకుండా వెళ్లిపో యారు. తాము టీవీ చానల్‌లో పెట్టిన సినిమా ఎందుకు చూడరని ప్రథమ సంవత్సరం విద్యార్థులపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాడికి పాల్ప డ్డారు. ఈ ఘటనలో ప్రథమ సంవత్సరం విద్యార్థికి తీవ్రగాయాలు కాగా వసతి గృహం సిబ్బంది పెనుబల్లి ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. వీఎం బంజర పోలీసులు దాడికి పాల్పడిన ద్వితీయ సంవ త్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

క్రీడాకారుల గని భద్రాద్రి జిల్లా

» కలెక్టర్ జితేష్ వి. పాటిల్ » సైక్లింగ్ పోటీలు ప్రారంభం



సైక్లింగ్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ జితేష్

చుంచుపల్లి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): క్రీడా కారుల గని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కొనియాడారు. ఆది వారం విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్‌లో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో క్రీడాకారులకు కొదువ లేదని, అన్ని రకాల క్రీడల్లో రాణిస్తున్న ఆణిముత్యాలను వెలికి తీస్తామని స్పష్టం చేశారు. ప్రాంతాలకతీతంగా గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను గుర్తించి శిక్షణ అందించి దేశానికి ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తా మన్నారు. ఈ క్రీడా పోటీల్లో 10 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల విభాగాలలో సైక్లింగ్ నిర్వహించారు. మొత్తం 40 మంది క్రీడాకా రులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని, వాటి వివరాలను త్వరలోనే ప్రకటి స్తామని సైక్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ వివి జి.కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పరంధామరెడ్డి, క్రీడాకారులు తది తరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైద్య విద్యార్థి మృతి



అఖిల్

కారేపల్లి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీక్యాతండాకు చెందిన హింకుడోత్ హచ్చు సింగరేణి సంస్థలో ఉద్యోగం చేస్తూ కుమారుడు వాంకుడో త్ అఖిల్(22)ను హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ ద్వితీయసంవత్సరం చదివిస్తున్నాడు. అయితే రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన అఖిల్‌ను కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. దీంతో బీక్యా తం డాలో తీవ్రవిషాదం నెలకొంది.

ప్రశాంతంగా గురుకులాల నీట్, జేఈఈ ఎంట్రెన్స్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల్లో నీట్, జేఈఈ శిక్షణ కోసం ఆదివారం నిర్వహించిన పరీ క్షలు ప్రశాంతంగా ముగిశాయి. రఘునాథ పాలెం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ పరీక్ష కేంద్రంలో మొత్తం 430 మంది విద్యార్థు లకు గాను 413 మంది విద్యార్థులు హాజరై నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను పరీక్షలు చేపట్టారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు కొనసాగాయి, రఘునాథ పాలెం సీఐ షరీఫ్ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు చేపట్టారు. కాలేజీ ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి, సింగరేణి గురుకులాల ప్రిన్స్‌పాల్ హరికృష్ణ పర్యవేక్షణ చేశారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

» బాలుడికి గాయాలు

» తప్పిన పెను ప్రమాదం



అదుపుతప్పి షాపులోకి దూసుకెళ్లిన కారు

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం ఒడ్డు గూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్ గ్రామంలో రోడ్డు పక్కన దుకాణంలోకి కారు దుసుకెళ్లి బాలుడికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు మహబుబాబాద్ నుంచి ఇల్లెందు వైపున వస్తున్న కారు నెహ్రూనగర్ గ్రామంలోకి రాగానే ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న రెండు కిరణా షాపులోకి దూసుకెళ్లింది. షాపులో ఉన్న రిత్విక్ అనే బాలుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. మద్యం మత్తులో కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్, మరో ఇద్దరు యువకులు కారు దిగి పరారై నట్లు తెలిపారు.

ప్రొద్దుటూరులో కలకలం

చింతకాని, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలంలో ప్రొద్దుటూరులో ఓ కోళ్లఫాంలో గత రెండు రోజుల నుంచి సుమారు వందకు పైగా కోళ్లు మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫాంను ఓ వ్యక్తి లీజుకు తీసుకొని గత కొంత కాలంగా కోళ్లను పెంచుతు న్నాడు. బర్డ్ ఫ్లూతోనే రోజుకు పదుల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పుకార్లు వ్యాపించడంతో పాటు పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వడంతో స్థానికంగా కలకలం రేపింది.



నేడు ఖమ్మంలో విద్యుత్ అంతరాయం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మైసమ్మనగర్ విద్యుత్ ఫీడర్ మరమత్తులు కారణంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ అధికారులు ప్రకటించారు. వరదయ్యనగర్, ఈఆర్ఆర్ రిసార్ట్స్ మమత హాస్పటల్‌రోడ్డు విద్యుత్ కోత ఉంటుందని ప్రకటించారు. మధురానగర్ ఫీడర్ మరమత్తులు కారణంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. మధురానగర్ 1నుంచి 4వీధులతో పాటుగా రాఘవయ్యనగర్ ప్రాంతాల్లోనూ విద్యుత్ కోత ఉంటుందని అధికారులు చెప్పారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	20
గుత్తి వంకాయ	44
బీరకాయ	44
పచ్చిమిర్చి	34
బెండకాయ	44
బెండకాయ	44
పొట్లకాయ	50
దోసకాయ	34-48
చిక్కుడు	38
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	24
క్యాప్సికం	48
ఆలుగడ్డ	24
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

నాల్గో తరగతి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): నాల్గోతరగతి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా నాయకుడు ఆర్ వెంకటేశ్వర్లు, బిక్కు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 2న ఉద్యోగుల క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ చెల్లింపు చేయాలన్నారు. ఈసమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌజ్‌బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోడి లింగయ్య, అజ్మత్‌బేగ్, డి.అంజమ్మ, గిరిజకుమారి, గఫూర్, సీతారాములు, రాంబాబు, రాంప్రసాద్, విజయకుమారి, భాగ్యలక్ష్మీ, సైదాలీ, ప్రచార కార్యదర్శి చావా నారాయణరావు పాల్గొన్నారు.

కేఎంసీలో దళారుల దాదాగిరి

- నేరుగా విభాగాల్లోకి వెళ్లి వీరంగం
- బిక్కుబిక్కుమంటున్న మహిళా ఉద్యోగులు



ఆసరా విభాగంలో గొడవ చేస్తున్న నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాయంలో దళారులు, పైరవీకారుల దాదాగిరి పెరుగుతోంది. మున్నేరు వరద సహాయం నుంచి రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేస్తామంటూ సాధారణ ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకొచ్చి నేరుగా కేఎంసీలోని ఆయా విభాగాల్లోకి వెళ్లి తాము చెప్పిన పనులు చేసి పెట్టాలని ఉద్యోగులపై వీరంగాలు చేస్తున్నారు. దీంతో కేఎంసీలోని ఉద్యోగులు తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నారు. రెగ్యులర్‌గా తాము చేసే ఫైల్స్ క్లీయర్ చేయలేక పోతున్నారు. కార్పొరేటర్లు, అధికారుల కంటే దళారులతోనే తమకు సమస్యలు పెరుగుతున్నాయని కేఎంసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

బృందాలుగా వెళ్లి బెదిరింపులు

పనిగంటలతో సంబంధం లేకుండా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పాలకవర్గంతో కూడిన కార్యాలయం కావటంతో ఉద్యోగులు నోరుమెదపలేని పరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలోనే కొంతమంది నాయకులు, దాళారులు, సిపార్స్‌కారులు నేరుగా ఉద్యోగుల ఛాంబర్‌లోకి వెళ్లి వీరంగం సృష్టిస్తున్నారు. నిబంధనల మేరకు ఇన్‌వార్డు వరకే పరిమితం కావాల్సిన నాయకులు ఏకంగా అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగుల వద్దకు నేరుగా వెళ్లి వారి పనులు చేయాలని హుకుం జారీ చేస్తూ హెచ్చరిస్తున్నారు. మేము వలాన నేత మనుషులం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఒక్కరిద్దరూ కాకుండా ఆరు నుంచి పది మంది వరకు గ్యాంగ్ వలే కేఎంసీ విభాగాలకు రావటంతో ఉద్యోగులకు భయందోళనకు గురైతున్నారు.

ఉద్యోగిని చుట్టుముట్టి

శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థలో చోటు చేసుకున్న ఓ సంఘటన మహిళా ఉద్యోగుల భయందోళనకు గురైనారు. 16వ డివిజన్‌కు చెందిన నాయకులు కేఎంసీ కార్యాలయానికి శుక్రవారం వచ్చారు. ఆసరా విభాగంలోకి వెళ్లి తాము గతంలో ఒకసారి ఆసరా పింఛన్లు దరఖాస్తులు చేస్తే పోయాయని మరోసారి దరఖాస్తులు చేశామని అవి ఏస్థాయిలో ఉన్నాయో చూపించాలని ఆ విభాగానికి చెందిన మహిళా ఉద్యోగిని ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఉద్యోగి వందల సంఖ్యలో దరఖాస్తులు ఉంటాయని వాటిని ఇప్పుడు బయటకు తీసి చూపించటం సాధ్యం కాదని సమాధానం చెప్పింది. దీంతో కోపానికి గురైన నాయకులు మహిళా ఉద్యోగిని చుట్టుముట్టి వీరంగం చేశారు. దీంతో ఆమె కంటనీరు పెట్టుకున్నారు. సమీపంలో ఉన్న ఉద్యోగులు వచ్చి నాయకులను వెనక్కి పంపారు. ఈ సంఘటన కేఎంసీలో ఉద్యోగుల్లో భయందోళన కలిగించింది.

బస్ డిపో రోడ్డును వెడల్పు చేయాలి: సీపీఎం



ఖమ్మంచర్చి కాంపౌండ్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి):బస్‌డిపోరోడ్డును 100 అడుగుల రోడ్‌గా విస్తరణ చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు.ఆదివారం పార్టీ ఖమ్మం టుటౌన్‌కమిటీ ఆధ్వర్యంలో బస్‌డిపో రోడ్డును పరిశీలించారు. సరైన విధానం లేకుండా గత ప్రభుత్వం ఖమ్మం నగరంలోని బస్‌డిపోరోడ్డులో డివైడర్లు కట్టి అస్తవ్యస్థంగా మార్చారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఈ పరిస్థితిని సరి చేయాలన్నారు. జిల్లామంత్రి చొరవ తీసుకుని 100అడుగుల రోడ్‌గా వెడల్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టుటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు టి.విష్ణువర్ధన్, భూక్యా ఉపేంద్ర, జె.వెంకన్నబాబు, ఎస్కే హుస్సేన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహారాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

జాతీయ రహదారిపై మిరప తివాచీ



ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి వద్ద ఆరబోసిన మిరపకాయలు

కూసుమంచి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలంలో ప్రస్తుతం ఎండు మిరప కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని నాన్ ఆయకట్టు పరిధిలో పెద్దఎత్తున సాగుచేశారు. ఆయకట్టు గ్రామాలలో ప్రస్తుతం పనులు లేకపోవడంతో కూలీలు ఇక్కడకు మిర్చికోతల నిమిత్తం వస్తున్నారు. ప్రధానంగా కూసుమంచి, లింగారాం తండ, కోక్యాతండ, లోక్యాతండ, జీళ్లచెరువు, అగ్రహారం, గ్రామాల రైతులు మిర్చిపంటను కోసిన అనంతరం ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఇలా సర్వీస్‌రోడ్డులో.. సగం రోడ్డుపై ఆరబెడుతున్నారు. రైతులకు సర్వీస్‌రోడ్డుపై వాహనాల రాకపోకలు తక్కువగా ఉంటాయి దీంతో మిరపకాయలను ఆరబెడుతున్నారు. దూరం నుంచి చూస్తే రహదారిపై ఎర్రటి తివాచీ పరిచినట్లు కనిపిస్తుండటంతో ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సేవారంగంలో లయన్స్‌క్లబ్ ముందంజ

కూసుమంచి, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా సేవలందించడంలో లయన్స్‌క్లబ్ ముందు వరుసలో ఉందని ఖమ్మం లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కూసుమంచి మండలం చేగొమ్మలో శ్రీదేవీ నర్సింగ్ హోమ్, ఓకంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగే సేవాకార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు ఉచితంగా ఉన్నత వైద్యం అందించాలనే లక్ష్యంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలతో పాటు శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. ఉచిత వైద్యంతో పాటు పేదవారికి ఆర్థికసాయం, నిరుపేదలకు ముడిసరుకులు, ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి శ్రీరాం, డాక్టర్ బొల్లికొండ శ్రీదేవి, గోపగాని సురేందర్, సునీల్‌గౌడ్, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం, సత్సంగం భక్తి మార్గం

సత్సంగ్ రాష్ట్ర అధ్యక్షుడు పండరీనాథ్



ప్రవచనాలు చెబుతున్న పండితురాలు, ఆత్మీయ భక్తి సమ్మేళానికి హాజరైన భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం సత్సంగం భక్తి మార్గమని సత్సంగ్ రాష్ట్ర అధ్యక్షుడు పండరీనాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని రోటరీనగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ భక్తజన బృందాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూజా విధానం, నామం, మంత్రంలో నిగూఢ అర్థం, భావాన్ని తెలియజేశారు. సక్రమమైన విధానం ద్వారా ప్రతీ హిందువుని జాగృతం చేసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనాల రామకృష్ణ, కృష్ణ, వెంకటేశ్వర్లు, నాగమణి, తిరుమల తిరుపతి ధర్మ ప్రచారకులు వేంకట రాణా ప్రతాప్, వనం తేజశ్రీ పాల్గొన్నారు.

బాబాకు పంచామృత అభిషేకం

నగరంలోని వరప్రదాత షిరిడీ సాయి మందిర్ 14వ వార్షికోత్సవం సందర్భంగా బాబాకు పంచామృత అభిషేకం నిర్వహించారు. మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన సప్తకళ సమ్మేళనం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం ఫైర్ ప్రార్థవిక పండు ఎంటర్టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్తకళ సమ్మేళనం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. రేలారేరేలా శివనాగులు, కాల్వకట్ల జాన్ జానపదగేయాలు ఆకట్టుకున్నాయి. పాలారాజుచే ఐదు తలల డ్యాన్స్ ఆకట్టుకుంది. ఫైర్ రవి విన్యాసాలు, రాజస్థానీ డాన్స్, భరతనాట్యం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నాగబత్తిని రవి, కురరువెళ్ల ప్రవీణ్, వేల్పుల విజేత, ట్రెస్మా రాష్ట్రసెక్రటీ ఐవి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాంతారావు హాజరయ్యారు.

కులాంతర వివాహాల ప్రోత్సాహకం పెంచాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహాల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వాలు రూ.10లక్షలకు పెంచాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటిభవన్‌లో జరిగిన కుల,మతాంతర వివాహితుల ఆత్మీయ అభినందన సభలో మాట్లాడారు. కులాంతర వివాహాలు కులరహిత సమాజ స్థాపనకు బాటలు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్రకోశాధికారి మాచర్ల భారతి, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, సామాజిక విశ్లేషకులు డాక్టర్ టీవీ రాఘవులు, బొంతు రాంబాబు, ముత్తమాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు పొంగులేటి ఆశీర్వాదం



కూసుమంచి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో పలుగ్రామాల్లో శుభకార్యాల్లో పాల్గొన్నారు. పెరిక శింగారం గ్రామానికి పర్వతబోయిన లక్ష్మయ్య కుమారుడి రమేష్ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నాయకన్‌గూడెం గ్రామంలో కందుల లక్ష్మయ్య కుమారుడి వివాహంలో పాల్గొన్నారు. ఆయన వెంట మద్దినేని స్వర్ణకుమారి, జూకూరి గోపాలరావు, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, వాసంశెట్టి వెంకటేశ్వర్లు, చాట్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

కిష్టారంలో చోరీ..

రూ.1,09,500 నగదు అపహరణ

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో తీసుకున్న రుణంతో పాటు ఇంట్లో ఉన్న కొంత నగదు చోరీకాబడిన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలం కిష్టారంలో చోటుచేసుకుంది. బాధితుడు పాగా వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. తన తండ్రి పాగా బిక్షం పేరుతో సొసైటీలో రూ.99,500తో పాటు ఇంట్లోని రూ.10వేలను శనివారం బీరువాలో పెట్టి ఉద్యోగం నిమిత్తం వెళ్లగా కుటుంబ సభ్యులు గ్రామంలోని నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొన్నారు. వృద్ధుడైన తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అదేరోజు రాత్రి నిద్రించి తెల్లవారు ఆదివారం రాత్రి బీరువాలో డబ్బుల కోసం చూడగా లాకర్ పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. అందులోని రూ.1,09,500 కనిపించకపోవడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. సత్తుపల్లి పోలీసులు వివరాలు సేకరించారు.

హాల్‌టికెట్‌లో అడ్రస్ సరిగా లేదని తల్లిదండ్రుల నిరసన

కొణిజర్ల,ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):సీవోఈ(సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ప్రవేశపరీక్ష ఇంటర్ ప్రవేశానికి స్థానిక లక్ష్యాలో గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రవేశపరీక్ష రాసేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులతో పాటు వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. హాజరైన విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంతమంది తమకు పరీక్షాకేంద్రానికి రావటానికి ఇబ్బంది పడ్డాం అని హాల్‌టికెట్‌లో సరైన అడ్రస్‌లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పరీక్షాకేంద్రం నిర్వాహకులు కూడా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్ వద్దకు వెళ్లి మరల వచ్చామని, కొంతమంది పరీక్ష రాకుండానే వెళ్లారని తెలిపారు. హాల్‌టికెట్ అడ్రస్‌లో కూడా ఫోన్‌నెంబర్ ఒకరిది, పేరు ఒకరిది ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన వారి ఫోన్‌నెంబర్ ఉండగా, పేరు మాత్రం ప్రస్తుతం పని చేస్తున్న వారి పేరు ఉంది. దీంతో కూడా కొంత సమస్య వాటిల్లింది.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

కొణిజర్ల, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఖమ్మం పరిసర ప్రాంతాల్లో మిర్చిసాగు అవుతుందని, ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం వ్యవసాయమార్కెట్‌లో ఈనెల 18న రైతులతో కలిసి మహాధర్నాను నిర్వహించబోతున్నామని, దానిని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ మిర్చి క్వింటాకు రూ.25 వేలు ధర ఏర్పాటు చేయాలని, రైతులు ఆత్మహత్యలు జరగకుండా గిట్టుబాటు ధర ఏర్పాటు చేసి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో చెరుకుమల్లి కుటుంబరావు,చింతనిప్పు నరసింహరావు, యాసా వెంకటేశ్వరరావు, వీరభద్రం, సాంబయ్య, పురుషోత్తం, శివ, తదితరులున్నారు.

దామాషా ప్రకారం మా వాటా తేల్చాలి

మున్నూరుకాపు సంఘం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): దామాషా ప్రకారం మా వాటా తేల్చాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో సర్వేలో మున్నూరు కాపు కులజనాభాను తక్కువగా చూపించారన్నారు. కులగణన రీసర్వే చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జనాభాను తక్కువగా చేసి చూపించడంతో రాజ్యాంగబద్ధంగా అందాల్సిన సంక్షేమ ఫలాలు దూరమవుతాయన్నారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్రకార్యవర్గసభ్యులు పసుపులేటి దేవేందర్, మేకల బిక్షమయ్య, కనిశెట్టి నరసయ్య,మెంతుల శ్రీశైలం, మడూరి పూర్ణచందర్‌రావు, ముత్యం ఉప్పల్‌రావు, శీలంశెట్టి వీరబద్రం, కార్పొరేటర్లు తోట వీరభద్రం పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరువు హత్యలపై ఉద్యమం

- 1నుంచి 8వరకు నిరసన కార్యక్రమాలు
- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి



మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలపై దాడులు, పరువు హత్యలపై పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలను ఖండించారు. మార్చి8న నిర్వహించే మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి1 నుంచి8వరకు నిరసన కార్యక్రమాలు పెడతామని ప్రకటించారు. రాష్ట్రంలో సరైన చట్టాలను అమలు చేయక పోవటంతో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో పటిష్టమైన చట్టాలను తీసుకొచ్చి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో మహిళలకు ప్రయోజనం లేదని కొట్టిపారేశారు. కేంద్రఆర్థిక మంత్రిగా మహిళా ఉండి కూడా మహిళల ఆర్థిక సమస్యలు పట్టించుకోలేదన్నారు.సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, ఝాన్సీ, శోభ, స్వాతి, పూలమ్మ, లలిత, పరిమిళ, వసుమతి, సరోజిని పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత డీఈవో కార్యాలయం సైన్స్‌మ్యూజియంలో ఆదివారం పరిశసీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మహాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కస్తూర్బాగాంధీ బాలికలు పి కార్తీకరేణు ప్రథమ బహుమతి, కీర్తి ద్వితీయ బహుమతి, తేజశ్రీకి తృతీయ బహుమతి సాధించారు. జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి జలగం నగర్ పాఠశాల విద్యార్థి వెన్నెలకు ప్రథమ బహుమతి, టీవీఎం మధిర విద్యార్థి సాయిగౌతమ్‌కు ద్వితీయ, బల్లేపల్లి విద్యార్థి చందాభావనకు తృతీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో డీసీఈబి సెక్రటరి నారాయణ, ఖమ్మం అర్బన్ మండల విద్యాశాఖ అధికారి శైలజలక్ష్మీ, టీజీఓ జిల్లా కార్యదర్శి వేల్పాద్రి హజరై ట్రస్ట్ సేవలును కొనియాడారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న శ్రీనివాసరావు

వాటర్ ట్యాంకర్ బోల్తా

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ లారీఅదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలోని గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్వహకులు సిమెంట్ రోడ్ వద్ద ట్యాంకర్ లారీని రివర్స్ చేస్తుండగా అదుపుతప్పి బోల్తాకొట్టింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడగా భారీ క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను బయటకు తీశారు.

సుబాబుల్, జామాయిల్ ధరల తగ్గింపుపై చర్యలు తీసుకోవాలి

అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): సుబాబుల్, జామాయిల్ ధరల తగ్గింపుపై ప్రభుత్వ తగిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష రైతుసంఘాల సమావేశంలో అఖిలపక్ష రైతుసంఘాల నాయకులు మాట్లాడారు. సుబాబుల్, జామాయిల్ కొనుగోలులో సిండికేట్‌గా మారి రైతులను తీవ్రంగా నష్టం చేస్తున్నారని ఆరోపించారు. కంపెనీలు సిండికేట్‌గా మారి దోపిడికి పాల్పడుతున్నారన్నారు. ఈసమావేశంలో రైతుసంఘాల నాయకులు బాగం హేమంతరావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, సామినేని హరిప్రసాద్, మలీదు నాగేశ్వరరావు, చావా కిరణ్, వేములపల్లి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

దిశానిర్దేశం చేసేదెవరో..?

వైరాలో చుక్కాని లేని నావగా బీఆర్ఎస్



వైరా, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చుక్కాని లేని నావలా తయారైంది. 2023 నవంబరులో బీఆర్ఎస్ ఓడిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో ఆపార్టీ పరిస్థితి దయనీయంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలైన మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ నియోజకవర్గానికి దూరంగా ఉండటంతో పార్టీకి దశాదిశ లేకుండా పోయింది. ఈ 15నెలల కాలంలో కేవలం మదన్‌లాల్ ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడ్‌ల్లో ఒకట్రెండుసార్లు పరామర్శలకు మాత్రమే పరిమితమయ్యారు. వైరా, కొణిజర్ల మండలాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఆపార్టీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

నానాటికీ తీసికట్టుగా బీఆర్ఎస్ పరిస్థితి...

ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పరిస్థితి నానాటికి తీసికట్టుగా తయారవుతుంది. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచి ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు ప్రాతినిథ్యం వహించినప్పటికీ ఇప్పుడా ఆపార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా తయారైంది. 2009లో మహాకూటమి నుంచి సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ బాణోతు చంద్రావతి ఆపదవి కాలం చివర్లో సీపీఐని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఉన్న చంద్రావతి బీఆర్ఎస్ నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆఎన్నికల్లో సీపీఎం మద్దతుతో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన బాణోతు మదన్‌లాల్ విజయం సాధించారు. ఆతర్వాత మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో మదన్‌లాల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన రాములునాయక్ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అయినప్పటికీ 2023ఎన్నికల్లో ఎమ్మెల్యే రాములునాయక్ స్థానంలో ఆయనపై ఓడిపోయిన మదన్‌లాల్‌కే బీఆర్ఎస్ టిక్కెట్ కట్టబెట్టారు. అయినా కూడా ఫలితం దక్కలేదు. మొత్తంగా మదన్‌లాల్ స్వతంత్ర అభ్యర్థిగా ఒకసారి, వైసీపీ నుంచి ఒకసారి, బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు పోటీచేసినప్పటికీ మూడుసార్లు ఓడిపోయి ఒక్కసారి మాత్రమే గెలిచారు. బీఆర్ఎస్ ఆయనపై విశ్వాసం ఉంచినప్పటికీ ఇక్కడి ప్రజల నుంచి ఆయన విశ్వాసాన్ని చూరగొనలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తాజా మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ప్రస్తుతం ఆయన రాజకీయాలకు దూరంగా తటస్థంగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో మదన్‌లాల్ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపటంలో వైఫల్యం చెందారనే చర్చ నడుస్తోంది.

కొద్దినెలల్లో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఓవైపు అధికార కాంగ్రెస్, వామపక్షాలు, తెలుగుదేశం సిద్ధమవుతున్నాయి. కానీ ఈ నియోజకవర్గంలోని ఐదుమండలాల్లో బీఆర్ఎస్‌కు దిశానిర్దేశం చేసే నాయకుడే కరువయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన మదన్‌లాల్ ఆతర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయం లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన నామా నాగేశ్వరరావు విజయం కోసం వైరా నియోజకవర్గంలో పనిచేసేందుకుగానూ అనేక షరతులు విధించారనే ఆరోపణలున్నాయి. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత వైరాలో మదన్‌లాల్ పనితీరును వివరిస్తూ పార్టీ అధిష్టానానికి నామా ఫిర్యాదు చేశారని సమాచారం. అంతేకాకుండా కారేపల్లి మండలంలో కొంతమంది మదన్‌లాల్ వర్గీయులు తరచూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌పై విమర్శలు చేయటం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మదన్‌లాల్‌నే బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగిస్తారా...? లేక వేరే నాయకుడిని నియమిస్తారా అనే దానిపై కూడా సర్వత్రా చర్చ జరుగుతుంది. సమయంలోనే ఇటీవల హైదరాబాద్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇంట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్న ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి మదన్‌లాల్ కూడా హాజరయ్యారు. శనివారం ఖమ్మం వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాల్గొన్న కార్యక్రమాలకు కూడా హాజరయ్యారు. ఈనెల 17న కేసీఆర్ జన్మదిన వేడుకలను ఏన్కూరు మండలంలో మదన్‌లాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని ఆయన వర్గీయులు ఇప్పటికే ప్రకటించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకుల నుంచి సమీకరించిన నిధులను తిరిగి చెల్లించే విషయమై కూడా ఇంతవరకు ఆయన ఎలాంటి ఆసక్తి చూపటం లేదని, తాము ఇచ్చిన మొత్తం తిరిగి వస్తుందో రాదోననే ఆందోళనతో వైరా, కొణిజర్ల మండలాల్లోని బీఆర్ఎస్ నేతలు మదనపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మదనలాల్ హైదరాబాద్, ఖమ్మం ఆపార్టీ అధినేతలు పాల్గొన్న కార్యక్రమాలకు హాజరైనప్పటికీ వైరా నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఆపార్టీ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నారు. ఈ తరుణంలో బీఆర్ఎస్ అధినాయకత్వం 15నెలల నుంచి నాయకత్వలేమితో ఉన్న ఈ నియోజకవర్గంలోని అఘాదాన్ని సరిచేసి పార్టీ శ్రేణుల్లో ఎలాంటి ఆత్మస్థైర్యాన్ని నింపుతుందో వేచిచూడాలని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన పీఏసీఎస్‌ల అధ్యక్షులు



మంత్రి తుమ్మలను కలిసి సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ, పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగింపుతో ఆదివారం కల్లూరు డివిజన్ పరిధిలో గల పలు గ్రామాలకు చెందిన పీఏసీఎస్‌ల అధ్యక్షులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శాలువలతో సన్మానించారు. గండుగలపల్లిలోని తుమ్మల నివాస గృహంలో కల్లూరు, తల్లాడ, వేంసూరు మండలలాకు చెందిన పీఏసీఎస్‌ల అధ్యక్షులు, డైరెక్టర్లు పాలెపు రామారావు, గొర్ల సంజీవరెడ్డి, బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్య, దిరిశాల నరిసింహారావు. తూము వీరభద్రరావు, చావా వెంకటేశ్వరరావు, తదితరులు గండుగలపల్లికి తరలి తుమ్మలను కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డీసీసీబీ, పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవి కాలం మరో 6 నెలలు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి తుమ్మలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'విద్యా, వైద్యరంగాలకు ప్రాధాన్యమివ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భారవి

వైరా, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్లో విద్యా, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతినివ్వాలని ఖమ్మం పట్టణ ప్రముఖ వైద్యుడు చీకటి భారవి, బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. వైరాలో ప్రతినెలా మూడో ఆదివారంలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులనుద్దేశించి వారు మాట్లాడారు. విద్యా, వైద్యం కోసం నిధుల కేటాయింపులు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వీటికి సరైన నిధుల్లేక పేదవారికి నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన నిధులను పెంచాలని కోరారు. రోగులను డాక్టర్లు భారవి, పిల్లలమర్రి సుబ్బారావు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, నిర్వాహకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభం



ఆరోగ్య శ్రీ సేవలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిరటౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మధిరలోని కేవీఆర్ ఆస్పత్రిలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించారు. కేవీఆర్ ఆసపత్రికి కొత్తగా ఆరోగ్య శ్రీ మంజూరు కావడంతో సేవలను ప్రారంభించి ఆన్‌లైన్‌లో సేవల నమోదు తీరును పరిశీలించారు. అనంతరం మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రమణగుప్త కుమార్తె వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, డాక్టర్లు కోట రాంబాబు, అరుణకుమారి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

● డ్రైవర్‌కు గాయాలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ లారీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన సత్తుపల్లి మండలం కిష్టాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్వహకులు దుమ్మూదూళీ లేవకుండా వాటరింగ్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ సమీపంలో సిమెంట్ రోడ్ వద్ద ట్యాంకర్ లారీని రివర్స్ చేస్తుండగా అదుపుతప్పి పొలాల్లోకి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడగా భారీ క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను బయటకు తీశారు.

నేడు సామాజిక తనిఖీ

ఎర్రుపాలెం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీశక్తి భవనంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజాదర్బార్‌ను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 31గ్రామాల ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం ఇప్పటికే తనిఖీ నిర్వహించిందని తెలిపారు. ఈనివేదికలు సంబంధించి జిల్లా అధికారుల సమక్షంలో ప్రజదర్బార్ జరుగుతుదని నివేదికను పరిశీలించేందుకు ప్రజలు హాజరుకావాలన్నారు.

ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణ



సమావేశంలో పాల్గొన్న రైతులు, నాయకులు

కొణిజర్ల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యధిక విస్తీర్ణంలో ఖమ్మం పరిసర ప్రాంతాలలో మిర్చి సాగు అవుతుందని, ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం వ్యవసాయమార్కెట్‌లో ఈనెల 18న రైతులతో కలిసి మహాధర్నాను నిర్వహించబోతున్నామని, దానిని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ మిర్చి క్వింటాకు రూ.25వేలు ధర ఏర్పాటు చేయాలని, రైతులు ఆత్మహత్యలు జరకుండ గిట్టుబాటు ధర ఏర్పాటు చేసి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకుమల్లి కుటుంబరావు, చింతనిప్పు నరసింహరావు, యాసా వెంకటేశ్వరరావు, వీరభద్రం, సాంబయ్య, పురుషోత్తం, శివ, భద్రయ్య, బాబు తదితరులున్నారు.

తల్లాడలో...

తల్లాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్చిని మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా క్వింటాకు రూ.25వేల ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 18న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో రాజబోయిన సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక చీడపీడలు, వ్యయప్రయాసలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండించిన మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో ధర క్వింటాకు రూ.13వేలు మాత్రమే ఉండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ దశలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకొనేందుకు మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, కల్యాణపు కృష్ణ, శీలం పకీరమ్మ, షేక్.మస్తాన్, చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భూక్యా వీరభద్రం

వైరా, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా శాంతినగర్‌లోని లంబాడీ తండాలో ఆదివారం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతినగర్ లంబాడ తండాలో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ గుడి వద్ద తండావాసుల ఆహ్వానం మేరకు భూక్యా వీరభద్రం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సీపీఎం నాయకుడు కొంగర సుధాకర్, బంజారాల సంఘం నాయకులు వాంకుడోతు బీక్యా, బాణోతు వెంకటి, రాము, దీరావత్ వెంకటి, తేజావత్ రాము, సైదులు పాల్గొన్నారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మధిర రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మిరప సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టాల్లో కూరుకొనిపోయారని క్వింటాకు రూ.25వేల రేటుతో ప్రభుత్వాలే మిర్చిని కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మధిర మండలంలో నిధానపురం, దేశినేనిపాలెం, ఆత్కూరు, రొంపిమళ్ల గ్రామాల్లో సీపీఎం నాయకులు పర్యటించి మిర్చి కల్లాల వద్ద రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు మందడపు ఉపేంద్ర, షేక్.ఉద్దండుసాహెబ్, సైదులు, సంపసాల గోపాలరావు పాల్గొన్నారు.

ప్రతిపక్షాన్ని ఎదుర్కోలేక అక్రమ కేసులు

జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

ఎర్రుపాలెం, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టి ఏడాది దాటినా గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కేసుల పేరుతో ప్రభుత్వం ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతునొక్కుతుందని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మండలంలోని అయ్యవారిగూడెంలో ఆదివారం విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అసమర్థ పాలనతో ప్రజలను ఇబ్బంది పెట్టడమే కాక ప్రతిపక్షాలను ఎదుర్కొలేక అక్రమ కేసులు బనాయిస్తుందని మండిపడ్డారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని, దానిని కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. పదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అందించిన కేసీఆర్ ప్రజల గుండెల్లో ఎప్పటికి ఉంటారన్నారు ఇప్పటికైనా పాలనపై దృష్టిపెట్టి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల నాయుకల యన్నం శ్రీనివాసరెడ్డి, సెగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, కలసాని వెంకటనారాయణ, కృష్ణారెడ్డి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిమార్గంలో ప్రయాణించాలి



మాట్లాడుతున్న మత బోధకుడు జుబేర్‌సాహెబ్

ఏన్కూరు ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మతం సూచించిన మార్గంలో ప్రయాణించాలని ఇస్లాం మత ప్రబోధకులు జనాబ్ జుబేర్ సాహెబ్ అన్నారు. ఆదివారం సాయిరాగూర్ ఫంక్షన్ హాల్‌లో ధార్మిక సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక చింతన తోటే మానసికప్రశాంతత కలుగుతుందని తెలిపారు. అనంతరం జలీల్‌ఖాన్ సాహెబ్, హిదాయత్ అలీ, ఖాస్మీసాహెబ్, యాకుబ్‌సాహెబ్‌ఖాష్మీ, మౌలానా అహ్మద్ సాహెబ్ రషాది, అబ్దుల్ అజీమ్ ఇమామ్ ఉపన్యసించారు. ఈకార్యక్రమంలో ముస్లిం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

మధిరటౌన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): మధిర టీవీఎం పాఠశాల పదవ తరగతి విద్యార్థి సాయి గౌతమ్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ బహుమతి సాధించాడని పాఠశాల ప్రిన్సిపల్ వై. ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన పరిశ సీతారత్నం టాలెంట్ టెస్ట్‌లో సాయిగౌతమ్ ద్వితీయ బహుమతితో పాటు రూ.6వేల నగదు రివార్డ్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పెద్ద పుల్లదాసు, రామారావు

కల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలోని కిష్టారం రహదారి వైపున గల శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం విశ్రాంత పోలీసు అధికారులు గుజ్జు పుల్లాదాసు, కుమ్మరి రామారావులు సీసీ కెమెరాలను ప్రారంభించారు. చిన్నకోరుకొండి చెందిన విశ్రాత పోలీసు అధికారి మన్నెం వెంకటేశ్వరరావు తనయుడు ఎన్ఆర్ఐ మన్నె ఆనందకుమార్ స్వగామానికి తన వంతుగా తోడ్పాటు అందించే క్రమంలో ఆలయానికి రూ.35 వేలు వితరణ చేశారు. విధంగా ఆలయ అభివృద్ధి ధర్మకర్త గుజ్జు పుల్లాదాసు 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, సీసీ కెమెరాలు వితరణ చేసినందుకు గాను దాతలకు గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు విశ్రాంత బ్యాంకు మేనేజర్ చలమల సత్యనారాయణ, చిన్నాల సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టు టెస్టులు



మెడల్‌ను అందజేస్తున్న ముళ్లపాటి సీతారాములు

వైరా, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం వైరా, భద్రాద్రి మార్షల్స్ హార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ రఘు పర్యవేక్షణలో బెల్టు టెస్టులు నిర్వహించారు. కరాటే మాస్టర్లు శేఖర్, రఘు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు కరాటే టెస్టుల్లో పాల్గొన్న విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేశారు.

నేడు ముదిగొండలో లింగమంతుని జాతర



ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

ముదిగొండ, ఫిబ్రవ రి 16 (ఆంధ్రజ్యోతి): ము దిగొండలోని పారిశ్రామిక ప్రాంతంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లింగమంతుని జాతర నిర్వహించనున్నారు. ఈ జాతరకు గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాలనుంచి భక్తులు హాజరుకానున్నారు. లింగమంతుని జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చికెన్‌షాపులు వెలవెల



వెలవెలబోతున్న చికెన్‌షాపులు

ఏన్కూరు ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): బాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిందనే ప్రచారంతో ప్రజలు చికెన్ తినడానికి భయపడుతున్నారు. దీంతో చికెన్‌షాపులు వెలవెలబోతున్నాయి. ఏన్కూరు మండలంలో సుమారు 25 షాపులున్నాయి. రోజుకు 25 క్వింటాళ్ల చికెన్ అమ్ముడుపోతుంది. తెలంగాణలోని సిద్దిపేట, తొర్రూరు, వరంగల్, జనగామ, కల్లూరు, సత్తుపల్లి, ఏపీలోని చింతలపూడి, విజయవాడ ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటారు. కిలో చికెన్ ధర రూ.240 ఉండగా నేడు రూ.180 కూడా కొనేందుకు ముందుకు రావడం లేదని చికెన్‌షాపుల యజమానులు వాపోతున్నారు.

విరాళాల అందజేత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం దాతల నుంచి విరాళాలు అందాయి. దాసరి సత్యనారాయణ, వెంకటరమణ, బాలాజీలు రూ.58,116లు, మట్టా శివరామకృష్ణ, చిరంజీవి మోహన్‌దాస్‌లు 400గ్రాముల శఠగోపురం, నరెడ్ల కృష్ణారెడ్డి, నాగరత్నమ్మ, కేశవరెడ్డి, ప్రమీళరాణి, రాజశేఖరరెడ్డిలు రూ. 25,116, కంకటి వెంకటేశ్వరరావు, స్వరూప, అలేఖ్యలు రూ.11,116, మాకరాజు వెంకట పూర్ణచంద్రరాజు, సుబ్బలక్ష్మి, డింపుల్ నంది, జయవెంకట నాగ శివరామరాజులు రూ. 11,116, జలదాని సూర్యనారాయణ, రామలక్ష్మీలు రూ.10,116, మహదేవ సురేష్, చందన, శివలు రూ.5,116, అచ్చన వెంకట అప్పారావు, లక్ష్మీనరసమ్మలు రూ.5,116, వల్లాల రాజేందర్ రూ.5,116లు ఆలయ కమిటీకి అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు శేషవస్త్రాలతో సన్మానించారు.

కిష్టారంలో చోరీ..

రూ.1,09,500నగదు అపహరణ



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో తీసుకున్న రుణంతో పాటు ఇంట్లో ఉన్న కొంత నగదు చోరీకాబడిన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలం కిష్టారంలో చోటుచేసుకుంది. బాధితుడు పాగా వెంకటేశ్వరరావు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. తన తండ్రి పాగా భీక్షం పేరుతో సొసైటీలో రూ.99,500తో పాటు ఇంట్లోని రూ.10వేల నగదును శనివారం బీరువాలో పెట్టి ఉద్యోగం నిమిత్తం తాను వెళ్లగా కుటుంబ సభ్యులు గ్రామంలోని నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొన్నారు. వృద్ధుడైన తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అదేరోజు రాత్రి నిద్రించి తెల్లవారు ఆదివారం రాత్రి బీరువాలో డబ్బుల కోసం చూడగా లాకర్ పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. అందులోని రూ.1,09,500 కనిపించకపోవడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. సత్తుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హాల్‌టికెట్‌లో అడ్రస్ సరిగా లేదని తల్లిదండ్రుల నిరసన

కొణిజర్ల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): సీవోఈ(సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ప్రవేశపరీక్ష ఇంటర్ ప్రవేశానికి గాను స్థానిక లక్ష్యాలో గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నందు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రవేశపరీక్ష రాసేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులతో పాటు వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. హాజరైన విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంతమంది తమకు పరీక్షాకేంద్రానికి రావటానికి ఇబ్బందిపడ్డాం అని హాల్‌టికెట్‌లో సరైన అడ్రస్‌లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పరీక్షాకేంద్రం నిర్వాహకులు కూడా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్ వద్దకు వెళ్లి మరల వచ్చామని, కొంతమంది పరీక్ష రాకుండానే వెళ్లారని తెలిపారు. అంతేకాకుండా హాల్‌టికెట్ అడ్రస్‌లో కూడా ఫోన్‌నెంబర్ ఒకరిది, పేరు ఒకరిది ఉంది. గతంలో ఇక్కడ పని చేసిన వారి ఫోన్‌నెంబర్ ఉండగా, పేరు మాత్రం ప్రస్తుతం పని చేస్తున్న వారి పేరు ఉంది. దీంతో కూడా కొంత సమస్య వాటిల్లింది. చివరికు విద్యార్థులు ప్రవేశపరీక్ష రాశారు. ఈ విషయంపై గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రజిత మాట్లాడుతూ మొత్తం 427 మంది విద్యార్థులకు గాను 396 మంది విద్యార్థులు హాజరై ప్రశాంతంగా పరీక్ష రాశారని తెలిపారు. ఎటువంటి ఇబ్బందిలేదని తెలిపారు.